ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 2 | సంచిక: 277 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 12 జనవరి 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## కొండపోచమ్మ సాగర్ వద్ద విషాదం

**హైదరాబాద్‌కు చెందిన ఐదురుగు మునక**
**సరదాగా వచ్చి డ్యామ్‌లో మునిగిన మృతి విషయం తెలిసి..**
**తల్లిదండ్రుల కన్నీరుమున్నీరు**



**సిద్దిపేట, జనవరి 11 (ప్రభాత ఉదయం):** సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మార్కూక్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ డ్యామ్‌లో పడి హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. నగరానికి చెందిన ఏడుగురు యువకులు శనివారం కొండపోచమ్మ సాగర్‌కు ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. మృతులు హైదరాబాద్‌కు చెందిన ధనుష్ (20), లోహిత్ (17), దినేశ్వర్ (17), జతిన్ (17), శ్రీనివాస్ (17)గా గుర్తించారు. మృతి చెందిన ధనుష్, లోహిత్ ఇద్దరూ సొంత అన్నదమ్ములు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వారంతా ..మిగతా 2లో



## సంక్రాంతి ఎఫెక్ట్

**ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు**
**సొంతూరు వెళ్లేందుకు జనంతో కిక్కిరిసిపోతున్న ప్రయాణ ప్రాంగణాలు**
**బస్సులు, రైళ్లలో సీట్లు దొరక్క అవస్థలు తప్పడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు**



**హైదరాబాద్, జనవరి 11 (ప్రభాత ఉదయం):** సంక్రాంతి పండుగ నేపథ్యంలో రద్దీతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడుతున్నాయి. పండుక్కి సొంతూరు వెళ్లేందుకు జనం పోటెత్తడంతో ప్రయాణ ప్రాంగణాలు కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్ నుంచి పల్లెలకు ప్రజలు భారీగా కదలివెళ్తున్నారు. సికింద్రాబాద్, జేబీఎస్, ఎంజీబీఎస్, కూకట్‌పల్లి, దిల్‌సుఖ్‌నగర్‌లోని బస్టాండ్లు ప్రయాణికుల రద్దీతో టకిటలాడుతున్నాయి. పండుగపూట స్వగ్రామాలకు వెళ్దామంటే చాలీచాలని బస్సులు, రైళ్లలో సీట్లు దొరక్క అవస్థలు తప్పడం లేదని జనం వాపోయారు. సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు వెళ్తున్న ప్రయాణికులతో హైదరాబాద్‌లోని ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడుతున్నాయి. ఎంజీబీఎస్, జేబీఎస్ తోపాటు కూకట్‌పల్లి, ఆరాంఘర్, దిల్‌సుఖ్‌నగర్ బస్టాండ్, ఎల్బీనగర్ కూడలి, వనస్థలిపురం, హయత్‌నగర్ వద్ద వాహనాల రద్దీ నెలకొంది. ప్రధానంగా ఏపీకి వెళ్లే రోడ్లపై రద్దీ కనిపిస్తుండగా సంక్రాంతి పండగ కోసం దాదాపు 6 వేల 432 బస్సులను నడుపుతున్నట్లు టీజీఎస్ ఆర్టీసీ తెలిపింది. హైదరాబాద్–విజయవాడ జాతీయరహదారిపై వాహనాల రద్దీ నెలకొంది. వాహనాలు భారీగా ..మిగతా 2లో

## నెలాఖరులో కొత్త ఉస్మానియా ఆసుపత్రికి శంకుస్థాపన

**కొత్త ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణంపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష**
**నెలాఖరులోగా ఆస్పత్రి శంకుస్థాపనకు వీలుగా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు**

**హైదరాబాద్, జనవరి 11 (ప్రభాత ఉదయం):** గోషామహల్‌లో కొత్త ఉస్మానియా ఆసుపత్రికి నెలాఖరు వరకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై అధికారులతో ఆయన సమీక్షించారు. గోషామహల్‌లో ప్రతిపాదిత స్థలానికి చెందిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వీలైనంత త్వరగా వైద్యారోగ్యశాఖకు బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండుశాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు చెందిన నమూనా మ్యాప్‌లని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్‌లలో సీఎం పలు మార్పులు, చేర్పులు సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులుడేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్న ముఖ్యమంత్రి భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. భవిష్యత్తులో రహదారి విస్తరణ, ఫ్లైఓవర్ వంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బంది తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలని నిర్దేశించారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేద తీరేందుకు గ్రీనరీ, పార్క్ ..మిగతా 2లో



## సంక్రాంతి పండుగ దృష్ట్యా ప్రత్యేక రైళ్లు

**హైదరాబాద్, జనవరి 11 (ప్రభాత ఉదయం):** సంక్రాంతి పండుగ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే అదనపు రైళ్లను నడిపించేందుకు చర్యలు చేపట్టింది. 26 అదనపు రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ నెల 17వ తేదీ వరకు ఈ అదనపు రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. చర్లపల్లి నుంచి విశాఖకు, సికింద్రాబాద్ బెంగళూరు మధ్య అదనపు రైళ్లను నడపనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని చర్లపల్లి – విశాఖ మధ్య జనసాధారణ్ అన్ రిజర్వ్‌డ్ రైళ్లను నడుపుతోంది. చర్లపల్లి నుంచి విశాఖకు ఈనెల 11, 13, 16, 18, 20, 25 తేదీల్లో రైళ్లు అందుబాటులో ఉండనున్నాయి. చర్లపల్లిలో ఉదయం 10 గంటలకు బయల్దేరి విశాఖకు రాత్రి 10 గంటలకు చేరుకోనున్నాయి. విశాఖ నుంచి చర్లపల్లికి ఈ నెల 10, 12, 15, 17, 20, 25 తేదీల్లో రైళ్లు నడవనున్నాయి. విశాఖ నుంచి సాయంత్రం 6.20కి బయల్దేరి ఉదయం 8 గంటలకు చర్లపల్లికి చేరుకోనున్నాయి.

## భూభారతితో సమస్యలకు చెక్

**కెసిఆర్ ఇష్టానుసారంతో ధరణి సమస్యలు**
**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి**



**నల్గొండ, జనవరి 11 (ప్రభాత ఉదయం):** ఇందిరమ్మ ఇళ్లలో గిరిజనులకు అధిక ప్రాధాన్యం ఇస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. తన గెలుపులో గిరిజనుల పాత్ర అధికంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పది శాతం రిజర్వేషన్లు అమల్లోకి రావడంలో తన కృషి కూడా ఉందని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి తండాలో గ్రామపంచాయతీ, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా భూ భారతి చట్టం రూపుదిద్దుకుంటుదన్నారు. భూ భారతిని గవర్నర్ కూడా ఆమోదించారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం ఇష్టారీతిన ధరణి అమలు చేసిందని.. కనీస నిబంధనలు కూడా లేకుండా ధరణి అమలు చేశారని తెలిపారు. ఫిబ్రవరి 15 లోగా భూ భారతి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి వస్తుందని అన్నారు. 2029లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అవుతారని.. తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారం లోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ కూలీలకు కూడా ..మిగతా 2లో



## త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

**పార్టీలో పనిచేసిన వారికే పదవులు**
**సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణపై స్పష్టత**
**దానం నాగేందర్ వ్యాఖ్యలను పరిశీలిస్తున్నాం**
**మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

**హైదరాబాద్ జనవరి 11 (ప్రభాత ఉదయం):** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని త్వరలో ప్రకటిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ వెల్లడించారు. నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని, ఆల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి పేరు చాలా మంది చెప్పారని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్రపక్షాలకు మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. శనివారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ వ్యాఖ్యలను ..మిగతా 2లో



## సాయిబాబా నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తా...

### కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి...

కుత్బుల్లాపూర్,జనవరి 11 (ప్రభాత ఉదయం) సుభాష్ నగర్ డివిజన్ కృషి కాలనీ సాయిబాబా నగర్ కమ్యూనిటీ హాల్ అభివృద్ధి నిర్మాణ పనులకు ఎల్లవేళలా కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కొలన్ హనుమంతు రెడ్డి అన్నారు. నియోజకవర్గం 130 డివిజన్ సుభాష్ నగర్ పరిధిలోని కృషి కాలనీ, సాయి బాబానగర్ కమ్యూనిటీ హాల్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి చొరవతో ఇంచార్జి మంత్రి శ్రీధర్ బాబు స్పెషల్ ఫండ్స్ ద్వారా 10లక్షల మంజూరు అయిన సందర్భంగా శనివారం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం కృషి కాలనీ సభ్యులు నియోజకవర్గ ఇంచార్జి హనుమంత్ రెడ్డి ని శాల్వాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సభ్యులు ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్ రెడ్డి, మాజీ ప్రెసిడెంట్ మాజిద్ పాషా, రాజి రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆనంద్, అంజి రెడ్డి, నర్స గౌడ్, సత్తి రెడ్డి, శాంతయ్య స్వామి, ప్రభాకర్, రామ్ రెడ్డి, మురళి, గోపాల్, సిద్ది రాములు, 130 డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, హరి కిరణ్, ద్వారంపూడి నాగి రెడ్డి, నగేష్ రెడ్డి, గురువ రెడ్డి, కరణ్, రాజు చారి, యూసుఫ్, నాగేంద్ర, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



## కెపిహెచ్బి కల్చరల్, వెల్ఫేర్, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా ముగ్గుల పోటీలు

### గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేసిన శేరి సతీష్ రెడ్డి

కూకట్‌పల్లి,జనవరి 11 (ప్రభాత ఉదయం) కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కల్చరల్, వెల్ఫేర్, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీజేఆర్ జ్ఞాపకార్థం ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేశారు. పీజేర్ ముగ్గుల పోటీ కార్యక్రమం శేరి మమతా, సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ముగ్గుల పోటీ కార్యక్రమంలో మహిళలు సంతోషంగా పాల్గొని వారి వారి ఆలోచనలకు అనుగుణంగా వివిధ రకాల ముగ్గులు వేశారు. ఈ పోటీలలో ఒకటి నుంచి ఆరు వరకు గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి గిఫ్ట్ బాక్స్ లు బహుకరించారు. ఈ కార్యక్రమంలో రేష్మ, లక్ష్మి, జోజమ్మ, మారుతి, తమ్మినేని ప్రవీణ్ కుమార్, సంజీవరావు, రాజేష్ గౌడ్, ఫణింద్ర కుమార్, పిడికిటి గోపాల్ చౌదరి, రాజు ముదిరాజ్, శ్రీధర్ చారి, రామకృష్ణారెడ్డి, గిరి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## కొండపోచమ్మ సాగర్ వద్ద విషాదం

మొదటి పేజీ తరువాయి...

స్నేహితులు కావడంతో సంక్రాంతి పండుగకు సెలవులు వచ్చేయడంతో ఎక్కడికైనా వెళ్లి ఎంజాయ్ చేయాలని భావించారు. అందుకు వారు సిద్దిపేట జిల్లాలోని కొండపోచమ్మ సాగర్ డ్యామ్‌కు బయలుదేరారు. అక్కడా బాగా ఎంజాయ్ చేసేందుకు ఏడుగురు యువకులు తమ తల్లిదండ్రులకు చెప్పి బయలుదేరారు. కానీ అదే వారికి చివరి చూపు అవుతుందని తల్లిదండ్రులు భావించలేదు. సరదాగా గడపడానికి వెళ్లిన వారి వెనకే మృత్యువు ఉందని గ్రహించలేకపోయారు. అనుకున్న విధంగా డ్యాం దగ్గరు చేరుకున్న ఆ ఏడుగురు యువకులు.. ఈత కొట్టాలని భావించారు. అంతా కలిసి డ్యాంలోకి దిగారు.. ఇంతలో ఏం జరిగిందో తెలియదు ఒకరి ఒకరి తర్వాత డ్యాంలో పడి గల్లంతయ్యారు. వీరు మునిగిపోతున్నట్లు గుర్తించిన గత ఈతగాళ్లు వెంటనే రంగంలోకి దిగారు. కానీ అప్పటికే జరగాల్సి నష్టం జరిగిపోయింది. ముందుగా యువకులు గల్లంతయ్యారన్న విషయం తెలిసిన వెంటనే వారి కోసం గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. మొత్తం ఏడుగురు యువకుడు డ్యాంలో పడిపోగా.. వారిలో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. మిగిలిన ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. వారి మృతదేహాలను ఒడ్డుకు చేర్చారు గజ ఈతగాళ్లు. వీరి మృతి విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం అందించారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సరదాగా వెళ్లిన తమ బిడ్డలు విగతజీవులుగా మారడంతో తల్లిదండ్రుల శోకం వర్ణణాతీతం. యువకుల మృతి వార్త తెలిసి ముషీరాబాద్‌లోనూ విషాదఛాయలు అలముకున్నాయి.

## త్వరలో ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన

మొదటి పేజీ తరువాయి...

పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకుంటామన్నారు. అందరి రిపోర్టు కేసీ వేణుగోపాల్ వద్ద ఉందన్నారు. పార్టీ నేతలందరూ వచ్చే 20 ఏళ్లను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని గట్టిగా హెచ్చరించారని చెప్పారు. ఈ నెలాఖరుకు పార్టీలో అన్ని కమిటీలు వేస్తామని, పనిచేసిన వారందరికీ పదవులు ఇస్తామని స్పష్టం చేశారు. పనిచేసిన నాయకులకే పదవులు వస్తాయన్నారు. కార్పొరేషన్ పదవుల భర్తీ ఈ నెలాఖరుకి పూర్తవుతుందని తెలిపారు.తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ ఎప్పుడు ఉంటోందో తేల్చిచెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో చేరికలు కూడా జోరుగా ఉంటాయన్నారు. గ్యాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ప్రకటన ఉంటుందని తెలిపారు. సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ చేస్తామని ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నామని.. సంకాంత్రి తర్వాత చేరికలు ఉంటాయని వెల్లడించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్ర పక్షాలకు మద్దతు ఇస్తామన్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ అధికారి గంగాధర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు.కాగా.. గత కొద్దినెలలుగా తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్‌లోనే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని అంతా భావించారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దలతో చర్చలు కూడా జరిపారు. డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఖాయమని అప్పట్లో మంత్రులు కూడా ప్రకటనలు చేశారు. యితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా.. ఈ నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ క్రమంలో రేవంత్ పర్యటన నేపథ్యంలో కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం కానుందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకొచ్చారు. ఇప్పుడు అనూహ్యంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్వయంగా మంత్రి వర్గ విస్తరణపై ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది.

# సంక్రాంతి ఎఫెక్ట్




మొదటి పేజీ తరువాయి...

తరలివెళ్లడంతో నగరం దాటేందుకు గంటల కొద్దీ సమయం పట్టింది. గంటలకొద్దీ వేచి చూడాల్సిన పరిస్థితి : రాష్ట్రంలో రెండో ప్రధాననగరం వరంగల్‌లోనూ రద్దీ నెలకొంది పండగరద్దీతో హనుమకొండ బస్టాండ్ జనసంద్రంగా మారింది. ఏకశిలా నగరం నుంచి సమీపంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లేవారు సరిపడా బస్సులు లేక గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. రద్దీకి సరిపడా బస్సులు నడపకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వాపోయారు .రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. జనంరద్దీదృష్ట్యా రైల్వేశాఖ పలుప్రాంతాలకి ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. హైదరాబాద్ మెట్రో రైళ్లలోనూ రద్దీ కొనసాగుతోంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎల్బీనగర్, మియాపూర్, సికింద్రాబాద్, ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర ప్రాంతాలకు చేరుకునేందుకు ప్రజలు మెట్రో రైళ్లలో ప్రయాణించారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, కోస్తాంధ్ర, ఉత్తరాంధ్ర వెళ్లే వారు ఎక్కువ మంది రైళ్లలో సీట్లు దొరక్క అవస్థలు పడ్డారు. ప్రత్యేక రైళ్లలో అన్‌రిజర్వ్‌డ్ సీట్లు ఎక్కువగా ఉంటే ఉపయోకరమని చెబుతున్నారు. ప్రత్యేక సర్వీసుల్లోనూ మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు.

## రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు కృషి చేయాలి: కలెక్టర్ సంతోష్

### సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష సమావేశం




సంక్షేమ పథకాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం)రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు జాబితా తయారీ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం ఐ.డి.ఓ.సి సమావేశం హాల్ నందు రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల వంటి సంక్షేమ పథకాల అమలుపై సంబధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం, నిరుపేద కుటుంబాల అభివృద్ధి కోసం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల ప్యూరిఫికేషన్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. రైతు భరోసా పథకంలో అర్హులైన రైతుల వివరాలను క్షేత్రస్థాయిలో సమీక్షించి, లబ్ధిదారుల పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడానికి అవసరమైన జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు ఇళ్లు కేటాయించే ప్రక్రియను కూడా వేగవంతం చేయాలన్నారు. ప్యూరిఫికేషన్ ప్రక్రియ 16వ తేదీ నుంచి ప్రారంభించి 20వ తేదీ నాటికి పూర్తిచేయాలన్నారు.16వ నుండి 18వ తేదీ వరకు ఫీల్డ్ పనులు పూర్తి చేసి,19వ తేదీ నాటికి కార్యాలయంలో సమీక్ష జరిపి, తుది జాబితాను 20వ తేదీకి సమర్పించాలన్నారు.21వ నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలు నిర్వహించి,తుది జాబితా ఆధారంగా లబ్ధిదారులను ఖరారు చేయాలన్నారు. ప్రతి మండలాన్ని రెండు భాగాలుగా విభజించి, ప్రతి భాగానికి డిప్యూటీ తహసీల్దార్‌ను బాధ్యత వహించేలానియమించాలని సూచించారు. డిప్యూటీ తహసీల్దార్ తో పాటు సీనియర్ అసిస్టెంట్ లేదా జూనియర్ అసిస్టెంట్, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను కూడా ఉంచుకుని డేటాను సక్రమంగా సమీక్షించి, సరైన పద్ధతిలో సర్వేను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఎ.ఓ. వీర భద్రప్ప, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియ నాయక్, ఏడీఏ సంగీత లక్ష్మి, అన్ని మండలాల తహసీల్దార్లు,ఆర్.ఐ లు,మండల వ్యవసాయ శాఖ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోట పట్టణ కేంద్రంలో వడ్డెర ఓబన్న జయంతి వేడుకలు నిర్వహిస్తున్న సంఘం నాయకులు

## ఓబన్న ఆశల కోసం ముందుకు సాగాలి

కొత్తకోట, జనవరి 11(ప్రభాత ఉదయం) కొత్తకోట వడ్డెర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డెర ఓబన్న218 జయంతి వేడుకలకు వనపర్తి జిల్లా గొర్రెల సంఘం మాజీ అధ్యక్షులు కురుమూర్తి యాదవ్, ఉమ్మడి జిల్లా సి డి సి చైర్మన్ కొత్తకోట మాస్ మహారాజ్ బీసం చెన్నకేశవరెడ్డి లు హాజరై నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మొదటి స్వాతంత్ర ఉద్యమానికి పదేళ్ల ముందే బ్రిటిష్ పాలకులను ఎదిరించిన. రాయలసీమ కొదమసింహం వడ్డెర జాతి ఆణిముత్యం స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతి సందర్భంగా ఆ ధైర్యశాలి కి జోహార్లు అర్పించారు .వడ్డెర సామాజ వర్గానికి రాజకీయంగా ప్రతినిత్యం సంక్షేమాలు అమలు చేయాలి అని ప్రభుత్వం వడ్డెర ఓబన్నను స్వాతంత్ర సమరయోధుడిగా గుర్తించి. హైదరాబాదులోని ట్యాంక్ బండలో ఆయన విగ్రహాన్ని నెలకొల్పడంతోపాటు ఆయన పేరట కేంద్రంలో పోస్టల్ స్టాంప్ ను విడుదల చేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు .సాంప్రదాయకంగా మైనింగ్లో నిమగ్నమై తరచుగా దోపిడీకి గురవుతున్న వడ్డెర వర్గానికి మైనింగ్ కాంట్రాక్టులు కేటాయించి ఉపాధిని కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు .మాజీ సర్పంచ్ శ్రీనివాసులు యాదవ్, ఎల్ఐసి కృష్ణ గౌడ్ మాజీ ఎంపీటీ సత్యం యాదవ్ యూత్ అధ్యక్షులు నెహ్రా రవీందర్ రెడ్డి ,మెగా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## భూభారతితో సమస్యలకు చెక్

మొదటి పేజీ తరువాయి...

ఆర్థిక సాయం ఇవ్వడం గొప్ప విషయమని చెప్పారు. అందరికీ తెల్ల రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 కిలోల సన్న బియ్యం ఇస్తుందని ప్రకటించారు. రాజకీయంగా కూడా అందరికీ సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. అటవీ హక్కుల ప్రకారం మిగిలిన గిరిజనులకు భూములు ఇస్తామని మాటిచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం అందరం కలసి పనిచేయాలని అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక ఒడిదుడుకుల కారణంగా ఒకటి రెండు హామీల అమలు ఆలస్యం అయిందని అన్నారు. త్వరలోనే ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీ అమలు చేస్తామని స్పష్టం చేశారు. భూమి లేని నిరుపేద కుటుంబాన్ని ఒక యూనిట్‌గా ఎంపిక చేస్తున్నామని అన్నారు. ఆ కుటుంబం తప్పని సరిగా ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ఉండాలని.. అంతకుమించి నిబంధనలు ఏమీ ఉండవని చెప్పారు. భూ భారతి విషయంలో చాలా పకడ్బందీగా చర్యలు ఉంటాయని అన్నారు. ఏపీ వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల శాఖను ప్రక్షాళన చేస్తున్నామని అన్నారు. ఖమ్మం జిల్లాలో వచ్చిన ఫిర్యాదులు ఆరోపణలపై శాఖా పరమైన విచారణ జరుగుతోందని చెప్పారు. 2025 భూ భారతి చట్టంలో ల్యాండ్ అప్పీలు అథారిటీని ప్రత్యేకంగా అమలు జరుపుతున్నామని చెప్పారు. సమగ్ర సర్వేపై త్వరలోనే స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని అన్నారు. 59 జీఓ ద్వారా కోట్లాది రూపాయల విలువైన భూములు పిక్ షర్ట్‌లకు కట్టబెట్టే ప్రయత్నం చేశారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో 59 జీఓ పేరుతో జరిగిన దోపిడీని అడ్డుకుంటామని చెప్పారు. ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే చర్యలు ఉంటాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

## నెలాఖరులో కొత్త ఉస్మానియా ఆసుపత్రికి శంకుస్థాపన

మొదటి పేజీ తరువాయి...

సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకి ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఆసుపత్రికి అవసరమైన వివిధ విభాగాలతో పాటు అకడమిక్ బ్లాక్, నర్సింగ్ ఉద్యోగులకు హాస్టళ్లు కూడా నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. కార్పొరేట్ తరహాలో వైద్య విభాగాలు, అన్ని సేవలు అక్కడే అందుబాటులో ఉండాలని సూచించారు. ఇప్పుడున్న ఉస్మానియా ఆస్పత్రి భవనాలను చారిత్రక కట్టడాలుగా పరిరక్షిస్తామని మూసీ రివర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా పర్యాటకులను ఆకట్టుకునే చారిత్రక భవనాలుగా తీర్చిదిద్దుతామని సీఎం గతంలోనే ప్రకటించారు. ఉస్మానియా భవనం సురక్షితం కాదని, ఆసుపత్రికి పనికిరాదని రెండేళ్ల క్రితమే నిపుణుల కమిటీ తేల్చింది. భవనానికి మరమ్మతులు చేసినప్పటికీ ఆసుపత్రికి కాకుండా ఇతర అవసరాలకే ఉపయోగించవచ్చని తెలిపింది. వారసత్వ కట్టడమైనందున ఉస్మానియా భవనానికి ఆర్కిటెక్ట్ పర్యవేక్షణలో మరమ్మతులు చేయవచ్చని సూచించింది. దీంతో ప్రభుత్వం కొత్త ఆసుపత్రి నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసింది.

### సంక్రాంతి పండుగకు స్వంత గ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో రద్దీగా మారిన

# ఆరాంఘర్ రూరల్ బస్ స్టాప్

ఆరాంఘర్ గ్రామీణ బస్‌స్టాప్‌లో ప్రయాణికుల రద్దీ





బుద్వేల్, జనవరి 11 (ప్రభాత ఉదయం) : సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వెళ్లే వారితో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఆరాంఘర్ గ్రామీణ బస్ స్టాప్ రద్దీగా మారింది. శనివారం ఉదయం నుంచే ప్రయాణికుల తాకిడీ ఆరాంఘర్ రూరల్ బస్ స్టాప్ కు ఎక్కువైంది. నగరంలో ఉండి చదువుకుంటున్న వారు, పనులు చేస్తున్న వారు. ఇక్కడ స్థిర పడిన వారు తమ స్వగ్రామలకు వెళ్లడానికి ఆరాంఘర్ రూరల్ బస్ స్టాప్ కు వస్తుండటంతో ఆర్టీసీ అధికారులు ఆరాంఘర్ వద్ద ప్రత్యేక సదుపాయాలు కల్పించారు. ఆరాంఘర్ రూరల్ బస్ స్టాప్ వద్ద ప్రైవేటు బస్సులను ఆపకుండ ఆర్టీసీ పోలీసులచే భద్రత ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు షాద్ నగర్, జడ్చర్ల, మహబూబ్ నగర్ ,కొత్తకోట, గద్వాల్ తో పాటు కర్నూల్ తదితర ప్రాం తాలకు వెళ్లే ప్రయాణికులతో ఆరాంఘర్ రూరల్ బస్ స్టాప్ రద్దీగా కనిపించింది.







సంక్రాంతికి స్వంత గ్రామాలకు వెళుతున్న ప్రజలు



రాజు వస్తాద్ ను సన్మానిస్తున్న మాల సంఘం ప్రతినిధులు

## రాజెంద్రనగర్ సర్కిల్ లోని మాల,వారి ఉపకుల సంఘాల నాయకులు సంక్రాంతి వేడుకలు

రాజేంద్రనగర్, జనవరి 11(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ లోని అంబేద్కర్ యూత్ క్లబ్ లో రాజెంద్రనగర్ సర్కిల్ లోని మాల,వారి ఉపకుల సంఘాల నాయకులు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన ఈ ఉత్సవాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలతో ముఖ్య అతిథిగా వచ్చిన దళిత రత్న శ్రీ రాజు ఉస్తాద్ నివాళులర్పించారు, జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కులపరిరక్షణ సంస్థ జాతీయ అధ్యక్షుడు డిసెంబర్ లో జరిగిన మాల మహా గర్జన సభకు సహాయ సహకారాలు అందించిన కార్య కర్తలకు శాలువాతో సత్కరించారు. ఈ సంభరాలకు 20 గ్రామాలనుండి వందమందికిపైగా హాజరు అయ్యారు. 10మంది యువతతో సర్కిల్ స్థాయిలో ఒక వర్కింగ్ కమిటీ ఉస్తాద్ పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశం జాతీయ షెడ్యూల్డ్ కులాల హక్కులపరిరక్షణ సంస్థ విద్యా విభాగం, రంగారెడ్డి జిల్లా కమిటీల పర్యవేక్షణలో ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో మాల సంక్షేమ సంఘం నాయకులు పచ్చా శ్రీనివాస్, రిటైర్డ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉద్యోగి డాక్టర్ వేము వందనం, రిటైర్డ్ ఏఎస్ఐ డి రమేష్, వీరన్న, అశోక్ కుమార్, శ్రీ శైలం, శంఖస్వామి, సాయ్ కృష ముత్యాలు,నర్సింహ,సంజీవ్, పంబాల రాజు, లక్ష్మణ్, చంద్ర శేఖర్, సత్యనారాయణ, కన్నయ, రవీందర్, భారత్,సరిత్,శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చేనేత సహకార సంఘం (కార్వన్ శాఖ ) అధ్యక్షులు పున్న కృష్ణ

## చేనేత అభయహస్తం చేనేతలకు ఎంతో దోహదం:

### చేనేత సహకార సంఘం (కార్వన్ శాఖ ) అధ్యక్షులు పున్న కృష్ణ

రాజేంద్రనగర్, జనవరి 11(ప్రభాత ఉదయం) కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చేనేత అభయహస్తం' పథకం ప్రవేశపెట్టి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆదర్శ కాలనీ చేనేత సహకార సంఘం (కార్వన్ శాఖ ) అధ్యక్షులు పున్న కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఆదర్శ కాలనీ లో సంఘం ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డికి చేనేత కార్మికులు పాలాభిషేకం చేశారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 'చేనేత అభయహస్తం' పథకాన్ని తీసుకొచ్చింది ఈ పథకం కింద నేతన్నల సంక్షేమానికి ప్రభుత్వం రూ.168 కోట్లు కేటాయించిందన్నారు. అనంతరం చేనేత సంఘం అధ్యక్షులు పున్న కృష్ణ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తీసుకున్న చొరవ వల్ల ఎంతో మంది నేత కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. చేనేత కార్మికుల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మూడు పథకాలను అమలు చేయడం సంతోషంగా ఉందని వెల్లడించారు.రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి చేనేత కార్మికులు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



## కాటేదాన్ ఆదర్శనగర్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

బుద్వేల్, జనవరి 11 (ప్రభాత ఉదయం): చేనేత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేనేత అభయ హస్తం పథకం తీసుకువచ్చి రూ.168 కోట్లు కేటాయించడం సంతోషకరమని ఆదర్శ కాలనీ చేనేత సహకార సంఘం (కార్మాన్ శాఖ) అద్యక్షులు పున్న క్రిష్ణ హర్షం వ్యక్తం చేశారు. శనివారం కాటేదాన్ ఆదర్శ కాలనీలో చనేత కార్మికుల తో కలసి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ పథకం ద్వారా చేనేత కార్మికులకు మేలు జరుగుతుందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం మూడు పథకాలు ప్రవేశపెట్టడం సంతోషకరమైన విషయమన్నారు.



ఆరాంఘర్ చౌరస్తాలో ప్రయివేటు బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ సిబ్బంది

## ఆరాంఘర్ చౌరస్తాలో ప్రైవేటు బస్సులను తనిఖీలు చేసిన ఆర్టీఏ అధికారులు

బుద్వేల్, జనవరి 11 (ప్రభాత ఉదయం) : రంగారెడ్డి జిల్లా ఉప రవాణశాఖ అధికారి సదానం దం ఆదేశాల మేరకు ఎంవీఐ లు సునీతారెడ్డి, కిరణ్ లు శనివారం ఉదయం ఆరాంఘర్ చౌరస్తా లో ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. రోడ్డు టాక్స్ కట్టకుండ నడుపుతున్న ఆరెంజ్ బస్సును సీజ్ చేశారు. చెన్నై, తిరువనంతపురం, పాండిచ్చేరి, మంగళూరు, మైసూరు. కన్యాకుమారి నుంచి హైదరాబాద్ వస్తున్న బస్సులను అధికారులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడుపుతున్న 12 బస్సు లకు రూ.35వేల జరిమాన విదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రైవేటు బస్సులలో ప్రయాణించే ప్రయాణికుల వివరాలు తప్పకుండ ఉం డాలన్నారు. దాడులు నిరంతరం కొనసాగిస్తామన్నారు.



తగుల పడిపోయిన డీసీఎం

## కార్టెన్ బాక్స్‌ల లోడ్‌తో ఉన్న డీసీఎంలో మంటలు

బుద్వేల్, జనవరి 11 (ప్రభాత ఉదయం) : మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనీ ఇందిరా గాంధీ కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో మహా మంగళ కార్టన్ వేస్టేజ్ గోదాం లో పార్కింగ్ చేసి ఉన్న డీసీఎం లో శనివారం ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి.. ఈ విషయాన్ని గమనించిన డీసీఎం డ్రైవర్ కంపెనీకి ఎలాంటి ప్రమాదం జరగకుండా డీసీఎం ను స్టార్ట్ చేసి కంపెనీ బయట నిలిపాడు.... ఒకసారిగా పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో డీసీఎం అగ్నికి ఆహుతి అయింది. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు



చైతన్య విలాస్ రామాలయం లో కూడారై పూజలు

## చైతన్య విలాస్ రామాలయంలో 108 గంగాళాలలో ప్రసాద వితరణ

బుద్వేల్, జనవరి11(ప్రభాత ఉదయం): ధనుర్మాస పూజలలో బాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్ గూడ చైతన్య విలాస్ కాలనీలో గల రామాలయం లో శనివారం కూడారై కార్యక్రమం నిర్వహించారు. 108 గంగాళాలలో పరమన్నం ప్రసాదాన్ని స్వామీ వారి ముందు పెట్టి ఆరగింపు తర్వాత వాటిని 108 మంది భక్తులకు అందజేశారు. భక్తీ శ్రద్ధలతో జరిగిన ఈ పూజా కార్యక్రమాలలో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. నెల రోజులుగా చైతన్య విలాస్ రామాలయంలో తిరుప్పావై ప్రవచనాలు ఆలపిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో ఈ కార్యక్రమం జరుగతుందని ఆలయ కమిటీ సభ్యులు కె. మురళీ, జే. మహేశ్, డి.రాజేశ్ కుమార్, డాక్టర్ వాసుదేవరావు, ఆదర్శ్ శుక్లా, పద్మశ్రీ లు తెలిపారు.

**ఈ నెల 13న తిరు కళ్యాణ మహోత్సవం :**

ఈనెల 13న భోగి పండుగ సందర్భంగా ఉదయం 9 గంటలకు స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కళ్యాణ మహోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దేవుని ఆశీర్వాదాలు పొందుకోవాలన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలకు ప్రత్యేక సంక్రాంతి

### మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్





రాంబాబు సూర్య భగవాన్ ఆలయంలో ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేస్తున్న కస్తూరి నరేందర్



రాజేంద్రనగర్, జనవరి 11(ప్రభాత ఉదయం) మన సంస్కృతి సాంప్రదాయాలకు సంక్రాంతి పండుగ ప్రతీక అని రాజేంద్రనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ కాంటెస్టెడ్ అభ్యర్థి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ అన్నారు. శనివారం అత్తాపూర్ డివిజన్ లో సూర్య భగవాన్ దేవాలయం లో కాంగ్రెస్ నాయకులు బోయ రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు ముఖ్యఅతిథిగా రాజేంద్రనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ కంటెస్టెడ్ అభ్యర్థి, మణికొండ మున్సిపల్ చైర్మన్ కస్తూరి నరేందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రతిభ చాటిన మహిళలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ పోటీలలో సాహితి మొదటి బహుమతి 10వేళ రూపాయలు , కిరణ్మయి 6వేల ద్వితీయ బహుమతి, ప్రేమలత 5 వేల మూడవ , నాల్గవ బహుమతి3000రూపాయలు నిత్య , ఐదవబహుమతి 2000రూపాయలు నందిని కి అందచేశారు .ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భాష్యం మధుసూదన్ రెడ్డి, కళ్లు గీత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముద్దగౌని భాస్కర్ గౌడ్,కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం గోవర్ధన్ రెడ్డి , కాంగ్రెస్ అత్తాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ గొంది ప్రవీణ్ రెడ్డి, రవి గౌడ్ , మహేందర్ , రమాదేవి, మధుబాబు , కన్నయ్య , భీమన్న , కృష్ణ మూర్తి , కవిత , మల్లికా , తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో చిరుత సంచారం ?

### నెల రోజుల్లో ముగ్గురికి కనిపించిందని ప్రచారం

రాజేంద్రనగర్, జనవరి11(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలం గాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లో చిరుతపులి కనిపించిందంటు కారులో అటుగా వెళ్లిన వ్యక్తి, స్విగ్గి బాయ్, మార్నింగ్ వాక్ చేసే వారు చెప్పడంతో వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేసే సెక్యూరిటీ గార్డులతో పాటు నార్మ్ లో పని చేసే సెక్యూరిటీ సిబ్బంది అలర్ట్ అయ్యారు. నెల రోజుల క్రితం వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి నార్మ్ వైపు వచ్చిన ఒక కారు డ్రైవరు చిరుత పులి కనిపించిందని నార్మ్ సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. తిరిగి పది రోజుల క్రితం వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం నుం చి నార్మ్ క్యాంపస్ వైపు వెళుతున్న స్విగ్గి బాయ్ అగ్రో ఫారెస్ట్రీ సమీపంలో చిరుత పులి కనిపిం చడంతో ఆయన వెనుకకు వచ్చి సెక్యూరిటీ గార్డుకు చెప్పి వెళ్లిపోయినట్లు తెలిసింది. నార్మ్ సెక్యూరిటీ అధికారులు ఈ విషయాన్ని అటవీ శాఖ అధికారులు దృష్టికి తీసుకువెళ్లగా వారు వచ్చి పరిశీలించి చిరుత సంచరించినట్లు ఎలాంటి అనవాళ్లు కనిపించలేదని సెక్యూరిటీ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. చిరుత సంచరిస్తే దేనినైన తిన్నట్లు, వాటి ఎముకలు కనిపిస్తాయని చెప్పినట్లు సమాచారం. ఏదైన పెద్ద పిల్లి లాంటిది తిరిగి ఉండవచ్చని చెప్పి వారు వెళ్లిపోయారన్నారు.

**గగన్ పహడ్ వాసి వెంకటేశ్ గౌడ్ కు కనిపించిన చిరుత :**

ఈ నెల 9న గురువారం ఉదయం 5:15 నిమిషాలకు గగన్ పహడ్ కు చెందిన వెంకటేశ్ గౌడ్ కు చిరుత కనిపిం చింది. స్వయంగా ఆయనే ఈ విషయాన్ని చెప్పాడు. తాను వాకింగ్ చేసి వ్యవసాయ విశ్వవిద్యాలయం లోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం సమీపంలో కూర్చొని ఉండగా చిరుత ఆ ప్రాంతానికి కొద్ది దూరం నుంచి వెళ్లడం చూశానన్నారు. దీంతో భయపడి తనతో పాటు వాకిం గ్ కు వచ్చి కొద్ది దూరంలో ఉన్న ఎల్లయ్య అనే వ్యక్తిని పిలిపించుకుని అక్కడినుంచి వెళ్లి పోయానన్నారు.



వాకర్స్ తో కలసి చిరుత పులి అడుగులను పరిశీలిస్తున్న వ్యవసాయ విశ్వద్యాలయం సెక్యూరిటీ సిబ్బంది

**గతంలో....**

గతంలో ఓ చిరుత ప్రేమావతిపేట్ పోలీస్ ఫైరింగ్ రేంజ్, నార్మ్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లలో పది రోజుల పాటు సంచిరించి ఎట్టకేలకు పాత కర్నూల్ రోడ్డులో అటవీశాఖ అధికారులకు చిక్కింది. అంతకు ముందు ఓ చిరుత హిమాయత్ సాగర్ కు వెళ్లే దారిలో వాలంతరి వెనుకాల వైపు ఓ వ్యక్తికి చెందిన పశువుల కొటం వద్ద కు రాగా దాన్ని ఆటవీశాక అధికారులు బోను ద్వారా వలపన్ని పట్టుకున్నారు. రాజేంద్రనగర్ పరిసర ప్రాం తాలు పెద్ద పెద్ద కొండలతో, అడవులతో ఉండటంతో ఈ ప్రాంతంలో చిరుత పులులు సం చరిస్తాయనే అనుమానాలు కూడా కలుగుతున్నాయి. ఎంతకైన మంచిది అటవీశాఖ అధికారులు ఈ ప్రాంతంపై నిఘా పెడితే బాగుంటుందని ప్రజలు అంటున్నారు.



## కొత్తకోట పట్టణ బిజెపి అధ్యక్షులుగా వనపర్తి శ్రీనివాస్ రెడ్డి

కొత్తకోట, జనవరి 11(ప్రభాత ఉదయం) భారతీయ జనతా పార్టీ కొత్తకోట పట్టణ అధ్యక్షులు గా వనపర్తి శ్రీనివాస్ రెడ్డి నియమితులయ్యారు. అదేవిధంగా జిల్లా కౌన్సిల్ మెంబర్ గా పబ్బా నరేందర్ గౌడ్ ని ప్రకటించారు. ఈ సందర్భంగా పట్టణ నూతన బిజెపి అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి బిజెపి సీనియర్ నాయకులు, మాజీ శాసనసభ్యులు డాక్టర్ రావుల రవీంద్రనాథ్ రెడ్డి ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలను తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వడ్డెర ఓబన్నకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## వడ్డే ఓబన్న ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలి:

**ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి.. వడ్డే ఓబన్నకు ఘన నివాళి**

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం)స్వాతంత్ర్య సమరయోధులు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సేనాధిపతి వడ్డే ఓబన్న 218వ జయంతి వేడుకలు శనివారం గద్వాల జిల్లా కేంద్రంలోని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..... ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి ముందే దక్షిణ భారతదేశంలో బ్రిటీష్ వలస పాలకుల ఆగడాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాటం జరిపిన రేనాటి యోధుడు వడ్డే ఓబన్న అని కొనియాడారు. ఆయన చరిత్ర చిరస్మరణీయమన్నారు. వడ్డే ఓబన్న విలువలు, సూచనలు పాటిస్తూ మెరుగైన సమాజం నిర్మాణం కోసం కృషిచేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పూడూరు కృష్ణ, వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు, వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పీడిఎస్ బియ్యం పట్టివేత

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం)అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న వాహనాన్ని శనివారం కేటిదొడ్డి పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ బి.శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధరూర్ కు చెందిన నరసింహ్మా అనే వ్యక్తి బొలేరో వాహనంలో రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న క్రమంలో పాతపాలెం గ్రామం వద్ద పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహించారు. 30 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు వివరించారు. ధరూర్ పరిసర ప్రాంతాల్లోని ప్రజల వద్ద నుంచి ప్రభుత్వ రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.



వడ్డే ఓబన్న చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అతను కలెక్టర్ లక్ష్మీనారాయణ

## వడ్డే ఓబన్న స్వాతంత్ర్య పోరాటంలో చేసిన త్యాగం, ధైర్యం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం: అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం)వడ్డే ఓబన్న జీవితం,స్వాతంత్ర్య పోరాటంలో చేసిన త్యాగం, ధైర్యం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ అన్నారు. శనివారం ఐ.డి.ఓ.సి ఆవరణంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి,చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చరిత్ర చిరస్మరణీయమని, ఆయన జీవితం అందరికి ఆదర్శమని, ఆయన విలువలు, సూచనలు పాటిస్తూ మెరుగైన సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలన్నారు. వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, ఆయన అందించిన స్ఫూర్తిని అందరూ స్మరించుకోవాలన్నారు.వడ్డే ఓబన్న ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన సహచరుడిగా బ్రిటిష్ పాలకుల వ్యతిరేకంగా చేసిన పోరాటం చాలా ప్రాముఖ్యమైనదని, ఆయన యొక్క ధైర్యం, నిస్వార్థత, దేశభక్తి నేటి తరాలకు ఒక మార్గదర్శకంగా ఉందని ఆయన పేర్కొన్నారు.వడ్డే ఓబన్న వంటి మహానుభావుల త్యాగాలను గుర్తించి,మనం కూడా తమ మార్గంలో నడిచి,సమాజానికి, దేశానికి సేవ చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,ఏవో వీరభద్రప్ప, బి.సి సంక్షేమ అధికారి రమేష్ బాబు,ఎస్సీ సంక్షేమ అధికారి సరోజ,జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నడిగడ్డ ఇలవేల్పు జమ్ములమ్మ, పరశురాముడు ఆలయ భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ పని చేయాలి: ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

### శ్రీజమ్ములమ్మ, పరుశరాముడు స్వామి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న లుఆలయ కమిటి చైర్మన్ ఎంసి వెంకట్రాములు

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం) నడిగడ్డలో భక్తుల కొంగుబంగారంగా పూజలందుకుంటున్న గద్వాల పట్టణ పరిధిలోని జమ్మిచేడులోగల శ్రీజమ్ములమ్మ, పరుశరాముడు స్వామి దేవాలయం నూతన పాలక మండలి శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ కమిటీ నూతన చైర్మన్ గా ఎంసి వెంకట్రాములు తోపాటు, సభ్యులుగా బి.మధుమతి, రాధారెడ్డి, వెంకటేష్,ఎస్.బాబు,మంగలి వీరేష్, కుర్వ ముసిలన్న ,అక్కల శ్రీనివాసులు, ఎ.రాజు, బైనీనాగరాజు, తూము క్రిష్ణ, ఎం.మల్లేష్, టి.చంద్రశేఖర్ లు ఆలయ ఈఓ పురేందర్, ఆలయ దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో శనివారం ప్రమాణం చేయించారు. ఈ ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథిగా హజరైన గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ... నడిగడ్డ ప్రాంతంలో ఎంతో పేరుగాంచిన శ్రీజమ్ములమ్మ, పరుశరాముడు స్వామి దేవాలయానికి భక్తులు అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో వస్తుంటారు కనుక భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రూపకల్పన చేయాలని పాలకమండలి సభ్యలకు సూచించారు. పదవి ఆకాంక్షతో కాకుండా దేవునికి సేవచేయాలనే దృక్పదంతో ఉండాలని కోరారు. భవిష్యత్తులో జములమ్మ దేవాలయంలో మరింత అభివృద్ధి చేసి రాష్ట్రంలోని ఒక పుణ్యక్షేత్రం వలె తీర్చిదిద్దే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో మా వంతు కృషి చేస్తానని అని తెలిపారు ఆలయ కమిటి చైర్మన్ ఎంసి వెంకట్రాములు మాట్లాడుతూ..మాపై నమ్మకం ఉంచి జమ్ములమ్మ ఆలయ కమిటీ చైర్మన్ గా సభ్యులుగా అవకాశం కల్పించిన స్థానిక ఎమ్మెల్యేకు ఎల్లప్పుడు రుణపడి ఉంటానని తెలిపారు. జములమ్మ ఆలయ అభివృద్ధిలో నా వంతు కృషిచేసి దేవాలయ అభివృద్ధి కొరకు తోడ్పాటు అని తెలిపారు. గద్వాల ఎమ్మెల్యే బండ్ల సహకారంతో త్వరలో జరగబోయే జాతర బ్రహ్మోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించి దేవాలయ వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలతో లాంటి ఇబ్బంది లేకుండా ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అంతకుముందు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి దంపతులు శ్రీ జమ్ములమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం ప్రాంగణంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల సమక్షంలో దేవాదాయ శాఖ అధికారులు ఆధ్వర్యంలో నూతనంగా నియామకమైన చైర్మన్ %ఽ% సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ హనుమంతు, వైస్ చైర్మన్ శ్రీకాంత్, వినియోగదారుల ఫోరం రాష్ట్ర మాజీ చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, జిల్లా గ్రంథాలయ మాజీ ఛైర్మన్ జంబు రామన్ గౌడ, జిల్లా రైతు సమితి మాజీ ఛైర్మన్ చెన్నయ్య, జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, రమేష్ నాయుడు, మాజీ ఆలయం చైర్మన్ సతీష్, కౌన్సిలర్లు మురళి, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, శ్రీను, నాగలత రామకృష్ణ శెట్టి, మాజీ ఎంపీపీలు, జెడ్పీటీసీలు, నాయకులు, కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు, పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

## శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి: ఎమ్మెల్యే జిఎంఆర్

**70 ఏళ్లలో శ్రీ కురుమూర్తి స్వామిని దర్శించుకున్న మొదటి సీఎం రేవంత్ రెడ్డి**







శ్రీ శ్రీ శ్రీ కురుమూర్తి స్వామి గిరి ప్రదర్శన లో పాల్గొన్న ఎమ్మెల్యేలు మెగా రెడ్డి ,జి మధుసూదన్ రెడ్డి, హిందూ బంధువులు శ్రీ కురుమూర్తి స్వామి భక్తులు

దేవరకద్ర , జనవరి 11(ప్రభాత ఉదయం) పేదల దేవుడు శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టితో ముందుకు వెళుతున్నారని దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు గవినోళ్ల మధుసూదన్ రెడ్డి శనివారం దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్న చింతకుంట మండలంలోని శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కురుమూర్తి గుట్ట వద్ద నిర్వహించిన గిరి ప్రదర్శన కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి , వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి, మహబూబ్ నగర్ మాజీ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి , టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి , కురుమూర్తి దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి , ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ ...కురుమూర్తి గిరి ప్రదర్శన కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.గత 70 ఏళ్ల పాలనలో కురుమూర్తి క్షేత్రానికి ఏ ముఖ్యమంత్రి రాలేదని, కురుమూర్తి స్వామి దర్శనానికి వృద్ధులు, వికలాంగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ఎలివేటేడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్ నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరడంతో మన పాలమూరు ముద్దుబిడ్డ కురుమూర్తి క్షేత్రానికి దర్శనానికి రావడంతో పాటు, ఎలివేటేడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్ నిర్మాణానికి 110 కోట్లు మంజూరు చేసి, కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, అంతేకాక దేవాలయ అభివృద్ధికి ప్రతిపాదనలు పంపమని తెలియజేయడంతో, భక్తుల సౌకర్యార్థం కళ్యాణమండపం, కాటేజెస్, తదితర అభివృద్ధి పనులు చేపట్టాలంటూ 66 కోట్లతో ప్రతిపాదనలు కలెక్టర్ కి పంపించడం జరిగిందని తెలియజేశారు. కురుమూర్తి గిరి ప్రదర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన నిర్వాహకులకు ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

## శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి




దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత రెడ్డి



గిరి ప్రదక్షణ చేస్తున్న కొండ ప్రశాంత రెడ్డి

దేవరకద్ర, జనవరి 11(ప్రభాత ఉదయం)శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత రెడ్డి కోరారు. శనివారం శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి ఆలయంలో నిర్వహించిన గిరిప్రదక్షిణలో దేవరకద్ర నియోజకవర్గం బిజెపి ఇంచార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండ ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ... ప్రతి అమావాస్య రోజు గిరిప్రదక్షిణ కార్యక్రమం కొనసాగించాలని కోరారు.ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ హిందువులంతా ఒక్కటై జాతీయ ఐక్యతను కాపాడాలని తెలిపారు. గిరిప్రదక్షిణ కార్యక్రమంలో పాల్గొన్న సాధువులకు, విశ్వహిందూ పరిషత్ సభ్యులకు, నాయకులకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, వివిధ మండలాల అధ్యక్షులు, బిజెపి కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## వడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులకు సన్మానం

గద్వాల జిల్లా ప్రతినిధి, జనవరి 11(ప్రభాత ఉదయం)జిల్లా కేంద్రంలోని జిల్లా వడ్డెర ఉద్యోగుల సంఘం కార్యాలయంలో జిల్లాలోని వడ్డెర ఉద్యోగుల ఆధ్వర్యంలో తొలి తరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర ఓబన్న 218వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు.. ఈ సందర్భంగా 2024 డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన గద్వాల్ టౌన్ కు చెందిన సంపంగి సంతోష్ , పాల్వాయి గ్రామానికి చెందిన శిరీష లను సన్మానించారు. టీచర్ ఉద్యోగంలో స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ పొందిన ఉస్సేన్ , కృష్ణ లకు సన్మానం చేశారు.. ఉపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం నుండి జిల్లా కేంద్రము కలెక్టరేట్ లో ఓబన్న జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషంగా ఉన్నదని హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ సంఘం నాయకులు మాట్లాడుతూ ...రాయలసీమలో వర్షాధార పంటలపై ఆధారపడి బతికే రైతులపై బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారు ప్రవేశపెట్టిన కొత్త రెవెన్యూ చట్టాల ద్వారా పండిన పంట కంటే అధిక పన్నులు వసూలు చేస్తూ, పన్నులు చెల్లించని రైతుల భూములు జప్తు చేస్తూ ప్రజల ధన, మాణ, ప్రాణాలను సైతం హరించేవారన్నారు. రాయలసీమ రైతుల హక్కుల కోసం ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి సర్వ సైనిక అధ్యక్షుడిగా ఒడ్డే ఓబన్న రైతులను, సంచార బహుజన జాతులను చైతన్య పరిచి సుమారు 9,000 మందితో సైన్యాన్ని ఏర్పాటు చేసి ఆ సైన్యానికి సైన్యాధ్యక్షుడిగా వ్యహరించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వడ్డెర ఉద్యోగులు నాగరాజు, శ్రీరాములు, ఉప్పలపాటి కృష్ణ, దేవేందర్, సుజాత, కుల పెద్దలు రాధా కృష్ణ, లక్ష్మన్న, నర్సింహులు , బాబు, గోపాల్ , ఐడియా పరుష రాముడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608